## క్లుప్తంగా

### పురుషులతో సమానంగా రాణించాలి

జహీరాబాద్ టౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డాక్టర్ విజయలక్ష్మి, డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు కిరణ్మయిలు అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో శ్రామిక్ విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళల పట్ల చిన్నచూపు చేసేవారికి కనువిప్పు కలిగించాలన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలకు ఆస్తి పంపకాలతో పాటు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉపన్యాస పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్షురాలు షాహీదాబేగం, కార్యదర్శి చంద్రకళ, న్యాయవాది శ్వేత, నాయకులు లలిత, మీనా, పూలమ్మ పాల్గొన్నారు.

### విద్యార్థులకు షూస్, బ్యాగ్‌ల పంపిణీ



జహీరాబాద్ టౌన్: మండలంలోని బూచినెల్లిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోలార్ ఆటో ఇంజినీర్ పరిశ్రమ యాజమాన్యం గురువారం బూట్లు, బ్యాగులు పంపిణీ చేసింది. సామాజిక సేవాకార్యక్రమాల్లో భాగంగా కంపెనీ మేనేజర్ భగీరథ, క్వాలిటీ ఇంజనీర్ నవీన్‌కుమార్, సూపర్‌వైజర్లు శైలేష్ కుమార్, విక్రమ్ విద్యార్థులందరికీ బ్యాగులు, బూట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జైపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, రవికాంత్, అనిత్, శ్రీలక్ష్మి, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ ఏస్తేరురాణి, ఉపసర్పంచ్ ఖలీల్ పాల్గొన్నారు.

### 'మాణిక్‌రెడ్డిని గెలిపించాలి'



పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

హత్నూర( సంగారెడ్డి): విద్యారంగ, ఉపాధ్యాయ అధ్యాపక సమస్యల పరిష్కారానికి పాపన్నగారి మాణిక్‌రెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని వివిధ పాఠశాలలు, కళాశాలను సందర్శించి ఉపాధ్యాయలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సింహాచలం, జిల్లా నాయకులు శివశంకర్, రాజు, లీలాకుమారి, నరసింహులు కార్యదర్శి అరుణశ్రీ , రామరాజు, భీంరావు పాల్గొన్నారు.

### టీచర్లకు సన్మానం



టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం

కంది(సంగారెడ్డి): మండలపరిధిలోని చేర్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం మహిళాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళ టీచర్లు స్వప్న, మీనాక్షి, నిర్మల, శోభలను సన్మానించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరాజయ్య, ఉపాధ్యాయులు సోమశేఖర్, రాజు, జగన్మోహన్, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

### రేషన్ డీలర్ నియామకం

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామ రేషన్‌డీలర్‌గా శివకుమార్ నియమితులయ్యారు. గురువారం ఝరాసంగంలో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.

### ఉపాధి పనులపై గ్రామ సభ



వివరాలు సేకరిస్తున్న దృశ్యం

రాయికోడ్(అందోల్): సంగాపూర్‌లో గ్రామ సభ నిర్వహించారు. ఉపాధి హామీ పనులను ఆడిట్ బృందం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ రాఘవేందర్ మాట్లాడుతూ రూ.58లక్షల పనులు చేశారన్నారు. పలు రకాల పనుల నిర్వహణలో ప్రాసిసర్స్ పాటించడం లేదని గుర్తించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుప్రియ, ఉప సర్పంచ్ నగేష్, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, మైనోద్దీన్ పాల్గొన్నారు.

### దేవాలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం(పటాన్‌చెరు): కానుకుంట గ్రామంలో నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మతల్లి దేవాలయానికి చిట్కుల్ సర్పంచ్ నీలం మధు గురువారం రూ.లక్ష విరాళాన్ని అందించారు. దేవాలయాల నిర్మాణాలకు విరాళం అందించిన ఆయనకు నిర్వాహకులు రవీందర్‌గౌడ్, విశాల్‌గౌడ్, సుధాకర్, కృతజ్ఞతలు చెప్పారు.

# అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి



జిన్నారం(పటాన్‌చెరు): కంటి అద్దాలను తొడిగిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



కంటి అద్దాలు తొడిగిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం మునిగేపల్లిలో రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులు, కంటి వెలుగు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నేతల మోసపూరిత మాటలు ఎవరూ నమ్మొద్దన్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మద్దతివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రాంసింగ్, పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, నవాబ్‌పటేలు, కాల్వ అంజిరెడ్డి, కాశయ్య, కిషన్, భూమయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గుమ్మడిదల ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్‌లు సూచించారు. మండలంలోని అనంతారం గ్రామంలో గురువారం కంటి వెలుగును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే పథకాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దీప, ఉప సర్పంచ్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి



ముగ్గులను పరిశీలిస్తున్న రోజారాణి తదితరులు



మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప నగేశ్



జోగిపేట(అందోల్): వ్యవసాయశాఖ అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

జిన్నారం(పటాన్‌చెరు): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి సూచించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో మహిళా దినోత్సవంలో భాగంగా గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు ఆమె బహుమతులను అందించారు. అనంతరం రోజారాణి మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందన్నారు. మున్సిపల్ పరిధిలో నిర్వహించే కార్యక్రమాలకు మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషన్ రాజేంద్రకుమార్ ఆయా కాలనీల మహిళలు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని డివిజన్ కార్పొరేటర్ పుష్ప నగేశ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా డ్వాక్రా మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ బాలయ్య, ప్రాజెక్ట్ అధికారిణి పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్, ఇన్‌పుట్, అవుట్‌పుట్, వాటర్‌గ్లాస్, స్కిప్పింగ్, స్పూన్ గోటి, రన్నింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

జోగిపేట(అందోల్): జోగిపేట వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏ శ్రీలత, ఏఓ విజయరత్న, ఏఈఓలను శాలువా కప్పి సన్మానించారు. మహిళా అధికారులు చేపడుతున్న సేవలను నిర్వాహకులు అభినందించారు.

### ఆలయ నిర్మాణానికి సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న అనంత్‌రెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): మన్‌సాన్‌పల్లిలో శ్రీ సీతారామ సమేత లక్ష్మణ ఆంజనేయ ఆలయ నిర్మాణానికి గుంతపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యువనాయకులు పడమటి అనంత్‌రెడ్డి గురువారం రూ.2లక్షల సాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అనంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్నకాలంలో రాజకీయంగా ఆయన రాణించాలని వారు కోరారు.

### బహుమతుల ప్రదానం



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ దశరథ్

మునిపల్లి(అందోల్): బయాలజీ టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచిన మోడల్ స్కూల్ విద్యార్థులకు ఎంఈఓ దశరథ్ బహుమతులు ప్రదానం చేశారు. గురువారం మండలంలోని ప్రతీ హైస్కూల్ నుంచి ఇద్దరు చొప్పున బయాలజీ టాలెంట్ టెస్టులో పాల్గొన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ టాలెంట్ టెస్టులో మోడల్ స్కూల్‌కు చెందిన మొదటి బహుమతి మల్లికార్జున్, రెండో బహుమతి మంజునాథ్‌లు కైవసం చేసుకున్నారు.

### సమస్యలు పరిష్కరించాలని ధర్నా

న్యాల్‌కల్(జహీరాబాద్): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం వీఓఏలు ఐకేపీ కార్యాలయ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా కాలంగా పని చేస్తున్నా తమ సమస్యలను పరిష్కరించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వానికి ఎన్ని మార్లు విన్నవించినా మార్పు రావడం లేదన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్, ఆరోగ్య బీమా, గ్రేడింగ్ లేకుండా వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఐకేపీ ఏపీఎం కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగేందర్, శరణప్ప, నర్సింహారెడ్డి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్య పరిరక్షణకు కృషి

జోగిపేట(అందోల్): ప్రభుత్వం ఆరోగ్య పరిరక్షణకు, వైద్య సదుపాయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని మాజీ ఏఎంసీ డీబీ నాగభూషణం అన్నారు. అంగన్ వాడీ టీచర్లు, ఆశా వర్కర్లతో కలిసి బీపీ, షుగర్ రోగులకు ఇంటింటికీ తిరుగుతూ ఆయన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య, విద్యపై ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఆరోగ్య శాఖలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, మధ్య తరగతి కుటుంబాలకు చేయూత నిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తుందన్నారు.

### స్వయం పాలన దినోత్సవం

న్యాల్‌కల్(జహీరాబాద్): హద్నూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా అశ్విత్, ఎంఈఓగా అవినాష్, హెచ్‌ఎంగా రాము, ఉపాధ్యాయులుగా రాధిక, సుహాసిని, సాయి, వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం తుకారం బహుమతులు ప్రదానం చేశారు.

# పారిశుధ్య కార్మికులకు సన్మానం



సన్మానిస్తున్న బీఎస్‌పీ నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో గురువారం బీఎస్‌పీ నియోజకవర్గ అధ్యక్షుడు సుంకు వినయ్ కుమార్ పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. బీఎస్‌పీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు నటరాజ్, కార్యదర్శి సంజీవ్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పారిశుధ్య కార్మికులను, ఆశ కార్మికులను, డ్వాక్రా మహిళలను సన్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



న్యాల్‌కల్లో రికార్డులను పరిశీలిస్తున్న పీడీ

న్యాల్‌కల్(జహీరాబాద్): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌రావు, ఏపీడీ జయదేవ్ ఆర్య హెచ్చరించారు. గురువారం ఎంపీపీ కార్యాలయ ఆవరణలో 2019 డిసెంబర్ నుంచి మార్చి 2022 వరకు ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల కాలంలో రూ.10.99 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. రూ.6,815లు రికవరీ తేలిందన్నారు. అందులో కొంత సొమ్ము జరిమాన విధించారన్నారు. చాలా వరకూ రికార్డులు సక్రమంగా లేవని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, మేట్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహించినట్లు తెలిసిందన్నారు. ఈ విషయంలో వారికీ షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. గ్రామాల్లో పర్యవేక్షణ లేకపోవడం వల్ల మొక్కలు ఎండిపోయినట్లు తనిఖీల్లో తెలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో క్యూసీ అమర్‌నాథ్, అంబుడ్స్‌మెన్ రోజారెడ్డి, ఎస్‌ఆర్‌పీ కొండల్, ఎంపీపీ అధ్యక్షురాలు అంజమ్మ, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ రంగారావు, సర్పంచ్‌లు అమీర్, మల్‌రెడ్డి, పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ **రోడ్లకు మరమ్మతులు చేయండి**

రామచంద్రాపురం (పటాన్ చెరు): ఔటర్ రింగ్ రోడ్డుని అనుకొని ఉన్న సర్వీస్ రోడ్డు పైన అనేక గుంతలు ఉన్నాయని వాటికి వెంటనే మరమ్మతులు చేయాలని జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల రింగ్ రోడ్డు వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం వెలిమెలకు చెందిన యువకుడు రోడ్డు గుంతల కారణంగా మృతి చెందాడని తెలిపారు. ఆ యువకుడి కుటుంబానికి రింగ్ రోడ్డు నిర్వాహకులు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే మాదిరిగా ప్రమాదాలు నివారించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

◆ **ఆశ్రమ నిర్మాణానికి భూమి విరాళం**

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): బసవలింగ అవధూత ఆశ్రమ నిర్మాణానికి గురువారం 15గంటల భూమిని ఆత్మకూరు గ్రామానికి చెందిన రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు, ప్రజలు ఆయనను అభినందించారు. భూమి విలువ సుమారు రూ.60లక్షల ఉంటుందని వారు తెలిపారు.

◆ **సహకార సంఘం అధ్యక్షుడిగా రమేశ్‌గౌడ్**

మునిపల్లి(అందోల్): మునిపల్లి గ్రామ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా రమేశ్‌గౌడ్‌ను ఎన్నుకున్నట్లు కో ఆపరేట్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు తెలిపారు. గురువారం మునిపల్లిలో కల్లుగీత పారిశ్రామిక గ్రామ కమిటీని కల్లుగీత పారిశ్రామిక సంఘం సభ్యులు ఎన్నుకున్నట్టు చెప్పారు. ఉపాధ్యక్షుడిగా చంద్రయ్యగౌడ్, నర్సింహాగౌడ్, ఎల్లయ్య ఎంపికైనట్టు తెలిపారు.

◆ **12న శాఖాహార ర్యాలీ**

నారాయణఖేడ్: ఈ నెల 12న అహింసాయుత మెగా శాఖాహార ర్యాలీ నిర్వహిస్తారని కంగ్టి, తడ్కల్ పిరమిడ్ స్పిరిట్యూవల్ సొసైటీస్ మూవ్‌మెంట్ కమిటీ బాధ్యులు తెలిపారు. కంగ్టిలోని శ్రీరామమందిరం నుంచి ఉదయం 9గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, విశిష్ట అతిథిగా తెలంగాణ పిరమిడ్ సేవాదళ్ అధ్యక్షుడు భూపతిరాజు హాజరవుతారని తెలిపారు.

◆ **కళాశాల వార్షికోత్సవం**

నారాయణఖేడ్: ఖేడ్‌లోని శ్రీసాహితీ జూనియర్ కళాశాల, యువచైతన్య డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సతీమణి జయశ్రీరెడ్డి విద్యార్థులకు బహుమతులను, ధ్రువపత్రాలను అందజేశారు.

# సమస్యలు వెంటనే పరిష్కరించండి



అధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రహమత్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం కాలనీని ఎమ్మెల్యే మాణిక్‌రావు సందర్శించారు. గురువారం కాలనీలో పర్యటించగా, ఎమ్మెల్యే దృష్టికి తాగునీరు, విద్యుత్ సమస్య ఉందని చెప్పారు. ఎమ్మెల్యే అక్కడి నుంచి అధికారులకు ఫోన్ చేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు నామ రవికిరణ్ గుప్త, శ్రీకాంత్‌రెడ్డి, అరుణ్‌కుమార్, సందీప్, ఇజ్రాయిల్ బాబి తదితరులు ఉన్నారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ**

చిరాగ్‌పల్లి గ్రామానికి చెందిన జైనోద్దీన్‌కు రూ.2లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మాణిక్‌రావు అందచేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ఘనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు ఇష్టపడి చదవాలని, వారిని అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరిన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. గత ఏడాది ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 22న ఉగాది, 30న శ్రీరామనవమి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు గురువారం శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయంలో పర్వదినాల తేదీల నిర్ణయంపై పటాన్‌చెరు పురప్రముఖుల సమావేశం నిర్ణయించినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మార్చి 22న ఉగాది, 30న శ్రీరామనవమి నిర్వహించుకోవాలని సమావేశంలో నిర్ణయించినట్టు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, మనోహర్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

### వక్తృత్వ పోటీలు



బహుమతులను ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో నామ సుభద్రమ్మ మెమోరియల్ ట్రస్టు, తెలంగాణ రికగ్నైజ్ స్కూల్ మేనేజ్‌మెంట్( టెస్మ) ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ×నేటి సమాజంలో స్త్రీ పాత్ర² అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. పారిశుధ్య కార్మికులను, జెడ్పీటీసీ సభ్యులు అరుణ విజయమోహన్‌రెడ్డి, స్వప్న భాస్కర్‌లను నిర్వాహకులు సన్మానించారు. నామ సుభద్రమ్మ ట్రస్టు అధ్యక్షుడు నామ రవికిరణ్‌గుప్త, ట్రస్మ జిల్లా అధ్యక్షుడు దశరత్‌రెడ్డి, శ్రీశైలం, కృష్ణరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ముజాహిద్, గౌతమ్, సునీల్, సంతోష్‌లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె కృష్ణ



కార్యకర్తలతో వడ్డె కృష్ణ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ తెలిపారు. జిన్నారం మండలంలోని సోలక్‌పల్లి, మంగంపేట గ్రామాల్లో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగు రమేశ్, సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

# శ్రీ జోగినాథ రథోత్సవానికి పూజలు



జోగిపేటలో రథానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జోగిపేట(అందోల్): జోగిపేటలో శ్రీ జోగినాథ రథోత్సవ ఏర్పాట్లలో భాగంగా గురువారం ఆలయ కమిటీ పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం జోగినాథ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగానే జోగినాథ దేవాలయం నుంచి రథాన్ని గౌని చౌరస్తా వరకూ తీసుకువెళ్లారు. ఉత్సవాల సందర్భంగా రథాన్ని అలంకరించి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, కమిషనర్ రవిబాబు, రథోత్సవ కమిటీ అధ్యక్షుడు డాకూరి శివశంకర్, కోశాధికారి రంగ సురేష్, సభ్యులు పి.శివశేఖర్, డీబీ నాగభూషణం, ఎస్.సురేందర్‌గౌడ్, నర్రా నగేశ్, జెడ్పీటీసీ సభ్యుడు ఖాదిరాబాద్ రమేశ్, సీహెచ్.వెంకటేశం, నాగయ్య, తుపాకుల సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలకు భయపడి ఒత్తిడికి గురికావొద్దు

యోగా శిక్షకుడు మహేందర్‌కర్ శివకుమార్



మాట్లాడుతున్న యోగా శిక్షకుడు శివకుమార్

సదాశివపేట(సంగారెడ్డి): పరీక్షలంటే భయపడి ఒత్తిడికి గురికావద్దని యోగా శిక్షకుడు మహేందర్‌కర్ శివకుమార్ విద్యార్థులకు సూచించారు. గురువారం పట్టణంలోని ఎడ్లబజార్ బసవేశ్వర మందిరంలోని కల్యాణ మండపంలో పది, ఇంటర్, డిగ్రీ పరీక్షల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు తీసుకోవల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ముఖ్యమైన అంశాల గురించి ఆయన వివరించారు. ఒత్తిడిని అధిగమించేందుకు యోగా సత్ఫలితాలను ఇస్తుందన్నారు. సమయానుకూలంగా పౌష్టికాహారం తీసుకొని, బాగా నిద్రపోతే జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. చదువుకునే సమయంలో ముఖ్యమైన అంశాలను బండ గుర్తులుగా మలుచుకుంటే సులువుగా జవాబులు రాయొచ్చన్నారు.

# ఘనంగా మైసమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన



న్యాల్‌కల్‌లో మైసమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా బోనాలు సమర్పిస్తున్న మహిళలు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లో నిర్వహించిన మైసమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహరాజ్ చండీయాగం , విగ్రహ ప్రతిష్ఠాపన, అన్నదానం నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలు సమర్పించారు.